క్లుప్తంగా

విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఈవో లక్ష్మణ్

జమ్మికుంట: మండలంలోని సైదాబాద్, పెద్దంపల్లి గ్రామాల్లోని రైతులకు వ్యవసాయ విస్తరణ అధికారి సీహెచ్.లక్ష్మణ్ ఆధ్వర్యంలో నకిలీ విత్తనాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో లైసెన్స్ కలిగి ఉన్న విత్తన డీలర్, రశీదు, కంపెనీ పేరు, విత్తన రకం, తదితర అంశాలను వివరించారు. తక్కువ, ఎక్కువ ధరలకు విత్తనాలు అమ్మిన వారి వివరాలను వ్యవసాయ అధికారులకు తెలియజేయాలన్నారు.

పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న విద్యుత్‌శాఖాధికారులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని వెంకట్రావ్‌పల్లె గ్రామం మీదుగా వెళ్తున్న నూతన 33/11 కేవీ విద్యుత్ లైన్ పనులను గురువారం కరీంనగర్ సూపరింటెండెంట్ ఇంజినీర్ వడ్లకొండ గంగాధర్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... బేతిగల్ సబ్ స్టేషన్ నుంచి రూ. 67 లక్షలతో పనులు జరుగుతున్నాయని, విద్యుత్ వినియోగదారులకు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయంగా లైను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. వెంట డివిజనల్ ఇంజనీర్ ఎస్ లక్ష్మారెడ్డి, ఏడీఈ పి.శ్రీనివాస్, రూరల్ ఏఈడీ రవీందర్ సిబ్బంది ఉన్నారు.

సాగునీటి కాలువలో పూడిక తీయాలి

సైదాపూర్: వర్షాకాలం వస్తున్నందున మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలకు సాగునీరందించేందుకు కాలువ పనులు చేపట్టాలని వెన్కెపల్లి సింగిల్ విండో చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి, సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు బత్తుల బాబు ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో గురువారం వేర్వేరుగా మాట్లాడారు. మండలంలో కొన్ని గ్రామాలకు మాత్రమే సాగునీటి కాలువలున్నాయని, దిగువ గ్రామాలకు కూడా కాలువ పనులు పూర్తి చేయిస్తే వర్షాకాలంలో పంటలకు సాగునీరు అందతుందన్నారు. సైదాపూర్ మండలానికి వచ్చే కెనాల్ ఏటా పూడికతో నీళ్లు రావడంలేదని, చిగురుమామిడి మండలం నుంచి సైదాపూర్‌కు వచ్చే కెనాల్‌లో పూడిక లేకుండా చేయాలని అధికారులను కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చి సాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న తిరుపతి, శంకర్

హుజూరాబాద్: హుజూరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేస్తే అద్భుత ఫలితాలు ఉంటాయని పార్టీ సీనియర్ నాయకులు మ్యాకల తిరుపతి, కొలిపాక శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ నేతృత్వంలో పార్టీ అన్నిచోట్ల బలపడుతుందని, పార్టీలో తగాదాలకు తావు లేకుండా ప్రణవ్ నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలందరూ ఒకేతాటిపైకి ముందుకు సాగాలన్నారు. పార్టీలో పనిచేసే ప్రతి కార్యకర్త, నాయకుడికి గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు.

రోడ్డుపై నిలిచిపోయిన గ్రానైట్ లారీ

- స్తంభించిన ట్రాఫిక్



లారీని నెట్టుతున్న ఏఎస్సై, గ్రామస్తులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం పెట్రోల్‌బంక్ సమీపంలో గురువారం గ్రానైట్ లారీలు పెట్రోల్ కోసం నిలిచాయి. ఓ లారీ మెయిన్ రోడ్‌పై ఆగిపోవడంతో రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఏఎస్సై సుధాకర్, సిబ్బంది, గ్రామస్తుల సహాయంతో లారీని పక్కకు తొలగించారు.

సాగుకు వేళాయే..

- వ్యవసాయ పనులు ప్రారంభించిన రైతులు
- ఇప్పటికే సాగు ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు
- రోహిణి కార్తెలో రెండు, మూడు వర్షాలు కురిస్తేనే విత్తనాలు విత్తుకోవాలని సూచన
- వానాకాలంలో వరి సాగుకే రైతుల మొగ్గు



పశువులతో పొలం చదును చేస్తున్న రైతు

వీణవంక: వానాకాలం సీజన్‌కు రైతులు సన్నద్ధమవుతున్నారు. 25న రోహిణి కార్తె ప్రవేశించగానే వ్యవసాయ పనులు ప్రారంభించారు. ఈ కార్తెలోనే పనులు ప్రారంభిస్తే పంట దిగుబడి ఆశించిన స్థాయిలో వస్తుందని రైతుల నమ్మకం. ఇప్పటివరకు ఆశించిన వర్షాలు కురువలేదు. రెండు, మూడు భారీ వర్షాలు కురుస్తేనే విత్తనాలు విత్తుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. గత సీజన్‌లో మొగిపురుగు ఆశించిండంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. ఆ అనుభవాలను దిగమింగుతూ కొంత మంది రైతులు వేసవి దుక్కులు దున్నే పనిలో పడ్డారు. పశువుల ఎరువు దుక్కిలో పోస్తున్నారు. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. వర్షాలు పడితేనే విత్తనాలు విత్తుకోవాలని, లేదంటే విత్తనాలు మాడిపోయే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. వానాకాలం సాగు ప్రణాళికను వ్యవసాయాధికారులు సిద్ధ చేశారు. విత్తనాలు, ఎరువులను తెప్పించేందుకు ఉన్నతాధికారులకు నివేదిక అందించారు.

ఆయకట్టు సాగు ప్రశ్నార్థకం

మండలంలో 26 గ్రామ పంచాయతీలున్నాయి. వరి 23 వేల ఎకరాలు, మొక్కజొన్న 300 ఎకరాలు, పత్తి మూడువేల ఎకరాలు, ఇతర పంటలు 200 ఎకరాల్లో వానాకాలంలో సాగు చేయనున్నట్లు అధికారుల అంచనా. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీళ్లు అందడంతో గుంట భూమి వదలకుండా పంటలు సాగు చేశారు. ఈసారి ఆ పరిస్థితి లేదు. అయినా రైతులు వరిసాగుకే మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే చెరువులు, కుంటలు, వాగులు వట్టిపోయాయి. వ్యవసాయ బావుల్లో నీటి మట్టం పడిపోయింది. రెండు, మూడు భారీ వర్షాలు కురుస్తేనే పంటలు సాగు ముందుకెళ్లనుంది. లేదంటే ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారనుంది.

సాగు ప్రణాళిక అంచనా ..

మండలానికి 300క్వింటాళ్ల జీలుగా విత్తనాలను కేటాయించగా ఇప్పటివరకు 120క్వింటాళ్ల జీలుగా బస్తాలు మండలానికి చేరాయి. 30కిలోల బస్తా రూ.1120 సబ్సిడీపై లభిస్తుంది. పొలం నాటు వేసే 40 రోజుల ముందు జీలుగ విత్తనాలను దుక్కిలో చల్లుకోవాలి. ఫలితంగా దిగుబడి కూడా ఆశించిన మేర వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే రైతులు జీలుగ విత్తనాలను విత్తుతున్నారు. ఎరువుల కొరత రాకుండా ఉండేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

వానాకాలం సాగుపై రైతుల ఆశలు

ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. భూమిలో వేడి పెరిగింది. రైతులు విత్తనాలు విత్తుకోవడం, నారు పోయడం చేయెుద్దు. భూమిలోని వేడిపొరల వల్ల విత్తనాలు మాడిపోతాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. వర్షం పడగానే దుక్కులు చదునుచేయడం రెండు భారీ వర్షాలు పడితే విత్తుకోవడం, నాటు వేసుకోవడం చేయాలి. కొందరు రైతులు ఇప్పటికే నారుమడులు సిద్ధం చేశారు. ఎండలకు నారు దెబ్బతినే అవకాశం ఉంది. యాసంగిలో ఆశించిన దిగుబడి రాలేదని కనీసం ఈ వానాకాలం అయినా కలిసిరావాలని రైతులు ఆశిస్తున్నారు.

రైతులు తొందరపడొద్దు

ఇప్పటివరకు ఆశించిన వర్షాలు కురువలేదు. రెండు, మూడు వర్షాలు కురుస్తేనే విత్తనాలు విత్తుకోవడం మంచిది. కొందరు రైతులు పొడి దుక్కిలోనే విత్తనాలు విత్తేందుకు సిద్ధమవుతున్నారు. వర్షాలు కురువకపోతే విత్తనాలు ఎండిపోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా వరి కొయ్యలను కాలబెట్టొద్దు. కొయ్యను కాల్చడం వల్ల భూసారం దెబ్బతింటుంది. వ్యవసాయ బావుల్లో నీటి సాంద్రతను బట్టి నారుమళ్లు చేసుకోవాలి. తొందరపడి నారు పోస్తే వర్షాలు పడకపోతే నారు ముదిరిపోయే ప్రమాదం ఉంది.

– గణేశ్, వ్యవసాయ అధికారి, వీణవంక

'ప్రభుత్వం సమస్యలు గాలికొదిలేసింది'

జమ్మికుంట: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర అధికార ముద్రను ఏర్పాటు చేస్తే ఎవరూ అభ్యంతరం తెలపకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలు గాలికొదిలి, కాలయాపన కోసం రాజముద్ర మార్పులు చేయడం సిగ్గుమాలిన చర్య అని జమ్మికుంట జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్‌శ్యామ్ ఎద్దేవా చేశారు. గురువారం పట్టణంలో మాట్లాడారు. కాంగ్రెస్ మేలు చేస్తుందని భావించిన ప్రజలకు రేవంత్ రెడ్డి మొండిచేయి చూపిస్తున్నారని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, మేనిఫెస్టోలోని అంశాలు కార్యరూపం దాల్చలేదని, టీఎస్‌ను టీజీగా మార్చినట్టు చెప్పుకునే పరిస్థితి ఉందన్నారు. ఎన్నికల కోడ్ అనంతరం ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని, రైతులకు వర్షాకాలంలో విత్తనాలు, ఎరువులు కొరత రాకుండా చూడాలన్నారు. సీఎం రేవంత్ పాలన తుగ్లక్ పాలనను తలపిస్తుందని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని గుర్తు చేశారు.

ఏఐఎస్‌బీలో చేరిక



సూర్యకిరణ్‌కు కండువా కప్పుతున్న సురేందర్‌రెడ్డి

హుజూరాబాద్: పట్టణానికి కొలుగూరి సూర్యకిరణ్ గురువారం ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్‌లో చేరారు. విద్యా రంగ సమస్యల కోసం రాజీలేని పోరాటాలు చేస్తామని, తనపై నమ్మకంతో పార్టీలో చేర్చుకున్నందుకు సూర్యకిరణ్ కృతజ్ఞతలు తెలిపారు.

చొప్పదండి కళాకారుల ప్రతిభ



కొండగట్టు ఆలయంలో జరిగిన భజన, శోభాయాత్ర కార్యక్రమాల్లో పాల్గొన్న కళాకారులు

చొప్పదండి: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పట్టణానికి చెందిన భజన కళాకారులు కొండగట్టు దేవస్థానం ఆహ్వానం మేరకు ఆలయంలో జరిగిన భజన కార్యక్రమాలు, శోభాయాత్రలో పాల్గొని ప్రతిభను కనబరిచారు. రెండు రోజుల పాటు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నామని భజన మండలి సభ్యులు తెలిపారు. చొప్పదండిలోని హనుమాన్ భజన మండలి, వెంకటేశ్వరసేవా సమితి, సాయిసేవా సమితి, సరస్వతి సేవాదళ్ సభ్యులు వేడుకలకు హాజరయ్యారు. కార్యక్రమాల్లో లచ్చయ్య, కొమురయ్య, లక్ష్మిరాజం, రవీందర్, చెట్టిపల్లి దామోదర్, గాజుల రమాదేవి, గుర్రం విజయ, అరుణ, పద్మ, విజయలక్ష్మి, కొత్తపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా సుభాష్‌గౌడ్



నియామక పత్రాన్ని అందిస్తున్న జాజుల శ్రీనివాస్

చిగురుమామిడి: మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఏఎస్సై గొడిశాల సుభాష్‌గౌడ్ తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామకమయ్యారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గురువారం కరీంనగర్‌లో జరిగిన సమావేశంలో నియామకపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కనుకయ్య, రాష్ట్ర కార్యదర్శి గీకురు రవీందర్, మండలశాఖ అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షుడు మోర ప్రవీణ్‌కుమార్, బొమ్మగాని వెంకటేశ్‌తదితరులున్నారు.

తెలంగాణ చరిత్రను చెరిపేస్తే ఊరుకోం

- రాష్ట్ర గీతాన్ని తెలంగాణ గాయకులతోనే పాడించాలి
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

కరీంనగర్: తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీసేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని, తెలంగాణ చరిత్రను చెరిపేస్తే ఊరుకునేది లేదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గురువారం కరీంనగర్‌లోని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర చిహ్నానికి తుదిరూపు ఇచ్చే ప్రక్రియలో కాకతీయ తోరణం, చార్మినార్ లేకుండానే డిజైన్లు రూపొందించి, చరిత్రను వక్రీకరించొద్దని పేర్కొన్నారు. రాష్ట్ర గీతాన్ని తెలంగాణలోని గాయకులతోనే పాడించాలని డిమాండ్ చేశారు. కీరవాణి సంగీత దర్శకత్వంలో ఇతరులు పాడటం తెలంగాణ కవులను, కళాకారులను అవమానించినట్లేనని తెలిపారు. మన రాష్ట్రంలో ఎంతో మంది కవులు ఉన్నారని, వందేమాతరం శ్రీనివాస్‌కు 9 అవార్డులు వచ్చాయని, చంద్రబోస్ లాంటి సంగీత దర్శకులు ఉన్నారన్నారు. వీరందరినీ కాదని సీఎం రేవంత్‌రెడ్డి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం, కీరవాణికి బాధ్యతలు అప్పగించడం బాధాకరమని పేర్కొన్నారు. ఏనాడూ జై తెలంగాణ అనని సీఎం తెలంగాణలో మెజార్టీ ప్రజల మనోభావాలను దెబ్బతీసే నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన సాగించిన కాకతీయులకు గుర్తింపు కళాతోరణమని, అధికారిక చిహ్నం నుంచి దాన్ని తీసివేయాలనే నిర్ణయం చారిత్రక తప్పిదమన్నారు. చార్మినార్‌నూ తొలగించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలోని అరుదైన వారసత్వ కట్టడాల్లో ప్రత్యేక స్థానం సాధించుకున్న చార్మినార్‌కు ఎంతో ఘనచరిత్ర ఉందని గుర్తు చేశారు. నాలుగు శతాబ్దాలుగా మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన చారిత్రక కట్టడాన్ని రాచరికపు ఆనవాళ్లుగా ప్రభుత్వం చూపించడం గర్హనీయమని పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ అనిల్‌కుమార్, నాయకులు అనిల్, ప్రభాకర్, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

డీఈపై విచారణ జరిపించండి

- మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి కార్పొరేటర్ ఫిర్యాదు

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థలో గతంలో డీఈగా పనిచేస్తూ అక్రమాలకు పాల్పడిన మసూద్‌పై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్‌కు చెందిన 41వ డివిజన్ కార్పొరేటర్ బండారి వేణు గురువారం మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కయిన సదరు డీఈ అంచనాలు భారీగా పెంచారని ఆరోపించారు. కిసాన్‌నగర్‌లోని ఏఎంసీలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్, యజ్ఞవరాహస్వామి దేవాలయం నుంచి రాజీవ్ రహదారి వరకు స్మార్ట్‌సిటీ నిధులతో గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మించిన రోడ్డు తదితరాల్లో అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

మంత్రి శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు



రక్తదానం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట: పట్టణంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలను గురువారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. శ్రీవిశ్వేశ్వర స్వామి దేవాయలంలో అన్నదానం, కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సజ్జు మహమ్మద్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 18 మంది యువకుల నుంచి రక్తం సేకరించి జమ్మికుంట స్పందన బ్లడ్ బ్యాంక్‌కు అందజేశారు. కొత్తపల్లిలోని స్పందన అనాథ ఆశ్రమంలో కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజేశ్వర్‌రావు, కోటి, రాచపల్లి రమేశ్, పద్మావతి, కౌన్సిలర్ వీరన్న, దొగ్గల భాస్కర్, పోతిరెడ్డి మల్లయ్య, చాంద్ పాషా, మధవరావు, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు పర్లపల్లి నాగరాజు, వాసాల సుధీర్, ముద్దమల్ల రవి, ఎండీ సలీం, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'కవ్వంపల్లి'ని విమర్శించొద్దు

- మానకొండూర్‌కు నిధులు తేలేదని జీవీఆర్‌పై మండిపడిన సంపత్‌గౌడ్



మాట్లాడుతున్న డీసీసీ కార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు

మానకొండూర్: బీఆర్‌ఎస్ పదేళ్లపాలలో చేసిన అభివృద్ధిపై పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు చర్చకు సిద్ధమా అంటూ డీసీసీ కార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్ సవాల్ విసిరారు. మండల కేంద్రంలో గురువారం మాట్లాడారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు రాజకీయ బ్యాక్‌గ్రౌండ్ లేదనడంపై మండిపడ్డారు. కవ్వంపల్లిని విమర్శించే స్థాయి లేదని అన్నారు. మేనమామ లేకపోతే జీవీ రామకృష్ణారావు గుండు సున్నా, సుడా చైర్మన్‌గా మానకొండూర్‌కు నిధులు తీసుకురాలేని అసమర్థుడు అని ఘాటుగా విమర్శించారు. ధాన్యం కొనుగోలు చేసిన రెండు మూడు రోజుల్లో ఖాతాల్లో డబ్బులు వేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో పెద్ద నాయకులు అరెస్టు అయితే రాజకీయ సన్యాసం తీసుకుంటారా అంటూ ప్రశ్నించారు. మూడు నెలల్లో ఐదు గ్యారంటీలు అమలు చేశామని, ఆగస్టు 15లోపు రుణమాఫీ చేయబోతున్నామని అన్నారు. చీకటి బాగోతాలు, వసూళ్లకు పాల్పడిన చిట్టా మా దగ్గర ఉందంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారీ, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



హుజూరాబాద్‌లో జెండా ఆవిష్కరిస్తున్న రమేశ్

హుజూరాబాద్: పట్టణంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జెండాను జిల్లా కమిటీ సభ్యుడు కదిరే రమేశ్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. కార్మికుల కనీస వేతనం రూ. 26 వేలు ఉండాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక చట్టాల మూలంగా కార్మికులు నష్టపోతున్నారని, కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బండ హమాలీ అధ్యక్షుడు కొంకటి చంద్రయ్య, మైసా చేరాలు, కొడిమాల వెంకటేశ్, అందేసి రవి, మోర మహేశ్, కొమ్ముల రవి, చిరంజీవి, సారయ్య, రాజ, శంకర్ తదితరులు ఉన్నారు.

కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం

మానకొండూర్: రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుంద రెడ్డి అన్నారు.మండలంలోని సదాశివపల్లి స్టేజీ వద్ద జెండా ఎగురవేసి సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం జరుపుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. సీఐటీయూ కార్మిక వర్గ హక్కుల కోసం రాజీలేని పోరాటాలు చేస్తుందని, జాతీయోద్యమ కాలం నుంచి కార్మికవర్గం సాధించుకున్న అనేక చట్టాలను యజమానులకు అనుకూలంగా సవరణలు చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను మోదీ సర్కార్ తీసుకువచ్చిందన్నారు. దీనికి వ్యతిరేకంగా కార్మికవర్గం నిరంతరం పోరాడుతుందని, రేవంత్ సర్కార్ గత ప్రభుత్వాలకు భిన్నంగా లేదన్నారు. పరిశ్రమల వేతనాల సవరణకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఈ ప్రభుత్వం ఇచ్చిందని, కానీ వేతనం ఏమాత్రం పెంచకుండా బేసిక్ డీఏ ఎంత అవుతుందో అంతే ఇచ్చి కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ భద్రయ్య, చౌదరి సంపత్, గట్టు సతీశ్, పోచయ్య, శ్రీనివాస్, ఎస్ రమేశ్, వనం ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె పకృతి వనాన్ని సందర్శించిన డీపీవో



నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో రవీందర్

జమ్మికుంట: మండలంలోని విలాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు, జీపీ నిర్వహణను జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) ఎ.రవీందర్, ఎంపీవో సతీశ్‌కుమార్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామంలో పల్లె ప్రకృతి వనం, కంపోస్ట్‌షెడ్డు, వైకుంఠధామం, నర్సరీ, క్రీడా ప్రాంగణాలను తనిఖీ చేశారు. పంచాయతీ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మనోహర్‌రెడ్డి, కారోబర్, సిబ్బంది పాల్గొన్నారు.



పీచుపల్లిలో తాగునీటి కోసం ఖాళీ బిందెలతో ఎదురుచూస్తున్న దళిత మహిళలు

సార్లు.. జర పట్టించుకోండి..

చిగురుమామిడి: పీచుపల్లి గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. ముఖ్యంగా ఎస్సీ, బీసీ కాలనీల్లో తాగునీటికి కాలనీవాసులు అల్లాడుతున్నారు. 4నెలలుగా ఎస్సీకాలనీలో నిత్యం తాగునీటికి వినియోగించుకునే బోరు పని చేయక పోగా.. బీసీకాలనీలో ఉన్న మరో బోరు నెల క్రితమే కాలిపోయింది. అధికారులు మరమ్మతు చేయించడం లేదు. దీంతో కాలనీకి సమీపంలో గల వ్యవసాయ బావి వద్దకు తాగునీటి కోసం పరుగులు తీస్తున్నారు. ఎస్సీ, బీసీకాలనీల్లో దాదాపు 100 నల్లా కనెక్షన్లున్నాయి. గ్రామంలోని ఎస్సీ, బీసీకాలనీవాసులు తాగునీటి కోసం అల్లాడుతుంటే.. గ్రామ ప్రత్యేకాధికారి ఇటువైపు తొంగిచూడకపోవడం గమనార్హం. అందుబాటులో ఉండే పంచాయతీ కార్యదర్శి క్షమారాణి సైతం సన్నేం చేయమంటారు, జీపీలో బడ్జెట్ లేదంటూ దాటవేత ధోరణిలో మాట్లాడుతున్నారని పలువురు దళిత, అంబేడ్కర్ సంఘం నాయకులు వెంకటేశ్, మాజీ ఉప సర్పంచ్ సది, మాజీ వార్డు సభ్యుడు మాంకాళి రాములుతోపాటు పలువురు ఆరోపించారు.

జూన్ 6న ఇసుక వేలం

మానకొండూర్: మండల పరిధిలో పట్టుబడిన ఇసుకను వేలం వేయనున్నట్లు తహసీల్దార్ రాజు తెలిపారు. 22 ట్రాక్టర్ల ఇసుక పట్టుబడిందని, తహసీల్దార్, పోలీస్ స్టేషన్ ఆవరణలో ఇసుక నిల్వ చేశామన్నారు. వేలంలో పాల్గొనేవారు. రూ.39,600 డీడీ 06 జూన్ 2024 లోపు చెల్లించి అదే రోజు వేలంలో పాల్గొనాలన్నారు. ఆసక్తి గలవారు వేలంలోపు ఇసుక నిల్వలను పరిశీలించవచ్చని తెలిపారు.

ఆలయంలో హోమం



శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్‌లో పురాతన వాలీ, సుగ్రీవుల దేవాలయంలో గురువారం వేదపండితులు మధుసూదన్, మురళీకృష్ణమాచార్యులు హోమం నిర్వహించారు. జాతర సందర్భంగా నిర్వహించిన హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.